క్లుప్తంగా

విశేషాలంకరణలో భీమ నాగలింగేశ్వర స్వామి


ప్రత్యేకాలంకరణలో స్వామివారు

దెందులూరు: గాలాయగూడెం శ్రీ అచ్చమ్మ పేరంటాలు తల్లి ఆలయ ఆవరణలో కొలువైన శ్రీ భీమ నాగ లింగేశ్వర స్వామికి ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు సుశీల్ శర్మ ఆధ్వర్యంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. పంచకట్టులో దర్శనమిచ్చిన స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.

దీక్షాధారుల ప్రత్యేక ప్రార్థనలు


దీక్షాధారులతో ప్రత్యేక పూజలు చేస్తున్న పాస్టర్లు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేటి గంగాధర్ బాబు నివాసంలో మూడు గ్రామాల దీక్షాదారులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిపారు. ఈ సందర్భంగా గంగాధర్ బాబు దంపతులను దీక్షదారులు, పాస్టర్లు అభినందించారు. రెండు దశాబ్దాలుగా మూడు గ్రామాలకు చెందిన 200 మంది దీక్ష దారులకు ప్రతి ఏటా ప్రత్యేక ప్రార్థనలు, భోజన వసతి కల్పిస్తున్న గంగాధర్ బాబు అభినందనీయమని దీక్షాదారులు పేర్కొన్నారు.

ఉగాది వేడుకలు


విద్యార్థులకు ప్రశంసాపత్రాల అందజేత

దెందులూరు: శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు గంగన్నగూడెం శ్రీ సాయి హైస్కూల్లో డైరెక్టర్ బోయపాటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు స్వయంగా షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి తయారు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. డైరెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు పండుగలు, సంప్రదాయాలు విశిష్టతలపై ప్రాథమిక స్థాయి నుంచి తెలియజేయాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సూచించారు.

గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

దెందులూరు: మెట్ట గ్రామాల్లో మినీ గ్రంథాలయం ఏర్పాటు చేయాలని చదువరులు, నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. దెందులూరు గ్రామం దాటిన తర్వాత పెరుగ్గూడెం వరకు గ్రంథాలయంగానీ, మినీ గ్రంథాలయంగానీ లేకపోవడంతో నిరుద్యోగులు, చదువరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పారావుపాలెం, శ్రీరామవరం, మేదినరావుపాలెం, ధర్మారావుపేట, రామారావుగూడెం, చల్లచింతలపూడి, తిమ్మన్నగూడెం, సీతంపేట, కేఎస్ పురం గ్రామాల్లో కనీసం మినీ గ్రంథాలయం కూడా లేదు. ప్రజాప్రతినిధులు జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు స్పందించి మెట్ట గ్రామాల్లో కనీసం మినీ గ్రంథాలయం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ముస్తాబైన మసీదులు

భీమడోలు: రంజాన్‌ను పురస్కరించుకుని మసీదులు విద్యుత్‌దీపాలతో ముస్తాబు చేశారు. నెలవంక కనిపించడంతో నెల రోజులపాటు కఠోర ఉపవాసదీక్షలు చేసిన ముస్లిం సోదరులు సోమవారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో మసీదులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వారంతా ఉపవాస దీక్షలు చేశారు. మసీదు కమిటీల ఆధ్వర్యంలో భీమడోలు, గుండుగొలను, పాతూరు, అంబర్‌పేట, పూళ్ల, పోలసానిపల్లి గ్రామాల్లోని మసీదుల్లో రంజాన్ వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

బొడ్డేపల్లి అప్పారావుకు ఉగాది పురస్కారం


కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా బొడ్డేపల్లికి ఉగాది పురస్కారం అందజేత

ఉంగుటూరు: నారాయణపురం గ్రామానికి చెందిన కళాకారుడు బొడ్డేపల్లి అప్పారావుకు ఉగాది పురస్కారం లభించింది. ఈమేరకు ఆదివారం ఏలూరులో జరిగిన ఉగాది వేడుకల్లో కలెక్టర్ వెట్రిసెల్వి, జెడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ బొడ్డేపల్లికి అవార్డును అందజేశారు. అయిదు దశాబ్దాలకు పైబడి కళాకారుడిగా విభిన్న పాత్రలు పోషించిన బొడ్డేపలి ఉగాది పురస్కారం అందుకోవడంపై పలువురు ఆయన్ను అభినందించారు.

క్రొవ్విడిలో ట్రాఫికర్

- ఆకివీడు వెళ్లేందుకు దగ్గర మార్గం కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం
- ఇరుకు రోడ్లు, ప్రమాదకర మలుపులే కారణం
- గంటల తరబడి నిలిచిపోతున్న వాహనాలు
- ఉదయం, సాయంత్రం వేళల్లో పెరుగుతున్న రద్దీ


క్రొవ్విడి ప్రధాన కూడలిలో నిలిచిపోయిన వాహనాల రాకపోకలు


శివాలయం మలుపులో బారులు తీరిన వాహనాలు

నిడమర్రు: గణపవరం నుంచి కలువపూడి వెళ్లే రహదారిలో రోజురోజుకు వాహనాల రద్దీ పెరిగిపోవడంతో ఆ మార్గంలోని పలు గ్రామాల్లో ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. ముఖ్యంగా క్రొవ్విడి, బావాయిపాలెం గ్రామాల్లో తరుచూ వాహనాలు గంటల తరబడి నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాల్లో రోడ్డు మలుపులు కూడా ప్రమాదకరంగా ఉండటంతో ఎదురెదురు వాహనాలు తప్పించుకునేందుకు తంటాలు పడుతూ ఢీకొట్టుకుంటున్న ఘటనలు తరుచూ చోటు చేసుకుంటున్నాయి. క్రొవ్విడి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా రోడ్డు ఆక్రమణలతో రహదారి కుదించుకుపోవడంతో అక్కడ పరిస్థితి మరింత దారుణంగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమణలు తొలగించి రోడ్డు వెడల్పు విస్తీర్ణం పెంచాలని గ్రామ పెద్దలు కోరుతున్నారు.

ఆకివీడుకు దగ్గర మార్గం కావడంతో..

భీమడోలు, గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు మండలాల్లోని గ్రామాల నుంచి ఆకివీడు వెళ్లాలంటే గణపవరం–కలువపూడి ఆర్‌అండ్‌బీ రహదారే దగ్గర మార్గం. గతంలో గణపవరం నుంచి ఆకివీడు వెళ్లేందుకు భీమవరం– ఉండి ఆర్‌అండ్‌బీ రహదారి మీదుగా ఉండి వెళ్లి అక్కడ నుంచి కైకులూరు ఆర్ అండ్‌బీ రోడ్డు మీదుగా ఆకివీడు వెళ్లేవారు. దీని వల్ల 14 కిలోమీటర్లు ఉండి వెళ్లి, అక్కడ నుంచి ఆకివీడు 12 కిలోమీటర్లు దీంతో 26 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉండేది. అదే గణపవరం నుంచి క్రొవ్విడి మీదుగా ఆకివీడు వెళ్లేందుకు 18 కిలోమీటర్లు మాత్రమే వెళితే సరిపోతుంది. దీంతో 8 కిలోమీటర్లు దూరం, సమయం తగ్గిపోవడంతో ఈ మార్గంలో వాహనాల రద్దీ రోజురోజుకు పెరిగిపోతుంది. గతంలో ఈ మార్గం అధ్వాన్నంగా ఉండటంతో ఉండిమీదుగా చుట్టూ తిరిగి వెళ్లేవారు. ఇటీవల మార్గంలో 2 కిలోమీటర్లు తప్ప మిగిలిన 16 కిలోమీటర్లు రోడ్డు బాగానే ఉంది. ఉండి నుంచి ఆకివీడు మార్గం పలు చోట్ల అధ్వాన్నంగా ఉండటంతో గూగుల్ మ్యాప్ కూడా ఈ మార్గాన్నే గుర్తించడంతో నారాయణపురంనుంచి వచ్చే హైవే వాహనాలు కూడా ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి.

రోడ్డు వెడల్పు చేయాలి

గణపవరం– కలువపూడి 38 కిలోమీటర్లు మేర ఉన్న ఆక్రమణలు గుర్తించి రోడ్డు వెడల్పు విస్తీర్ణం పెంచాలని ఈ మార్గంలోని గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు. గణపవరం– కలువపూడి ఆర్‌అండ్‌బీ రహదారి వెంబడి నిడమర్రు మండలంలోని బావాయిపాలెం, క్రొవ్విడి గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల ప్రధాన కూడళ్లుకూడా ఈ మార్గం వెంబడే ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పెరుగుతున్న ట్రాఫిక్‌తో గ్రామస్తులు కనీసం నడిచే పరిస్థితి లేదని చెపుతున్నారు. మేతల లారీలు, కోరీ లారీలు వంటి భారీ వాహనాలు ఈ మార్గంలో వెళ్లే సమయంలో క్రొవ్విడి, బావాయిపాలెం మలుపుల్లో ఇరుక్కుపోతున్న ఘటనలు జరుగుతున్నట్లు చెపుతున్నారు. ఈ గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ అధికారులు సర్వే చేసి ఆక్రమణలు తొలిగిస్తేగానీ ట్రాఫిక్ సమస్య తీరదని ఆయా గ్రామ ప్రజలు చెపుతున్నారు.

ఆక్రమణలు తొలగించాలి



క్రొవ్విడి గ్రామంలో కలువపూడి ఆర్‌అండ్‌బీ రహదారి మార్గంలోని ఆక్రమణలు అధికారులు సర్వే చేసి గుర్తించి తొలగించాలి. గత కొంతకాలంగా క్రొవ్విడి గ్రామ మలుపుల్లో రహదారి అక్రమణలకు గురైంది. దీంతో మలుపుల్లో తరుచూ ట్రాఫిక్ సమస్యతో ఒక్కోసారి కనీసం నడిచి కూడా వాహనాలు తప్పించుకునేందుకు కూడా వీలు లేకుండా ఉంటుంది. అధికారులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

– విజయ కుమార్, క్రొవ్విడి

కేన్సర్‌పై అశ్రద్ధ వద్దు


కేన్సర్‌పై ఇంటింటా అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకుంటూ, ఆరు నెలలకు ఒకసారి వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని గోపన్నపాలెం పీహెచ్‌సీ డాక్టర్ రాకేష్, డాక్టర్ రోజా అన్నారు. ఆదివారం గోపన్నపాలెం వైద్యశాలలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న కేన్సర్ సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. ఆరోగ్య పరిస్థితులను గమనించుకుంటూ అనారోగ్యం సంభవిస్తే సమీప వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకుని నిర్ధారణ అయితే మందులు తీసుకోవడం ద్వారా వ్యాధి తగ్గుముఖం పడుతుందన్నారు. ఎంపీహెచ్‌ఈఓ సత్యనారాయణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కేన్సర్ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షలకు సంబంధించి సుదీర్ఘంగా ఇంటింటా అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఆదివారం గ్రామ శివారు ప్రాంతాల్లో జరుగుతున్న సర్వేను డాక్టర్ రాకేష్, ఎంపీహెచ్‌ఈఓ పరిశీలించారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

దెందులూరు: రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం రద్దు చేసినట్లు తహసీల్దార్ బీ.సుమతి తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

వైభవంగా ఉగాది సంబరాలు


భీమడోలు: కొత్తపేటలో అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే వాసుబాబు


దెందులూరు: అమ్మవారిని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు


భీమడోలు: అమ్మవారికి గాజుల అలంకరణ


ఆకట్టుకున్న శక్తివేషాల విన్యాసాలు

భీమడోలు: ఉగాది సంబరాలు మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూళ్ల పంచాయతీ పరిధి కొత్తపేటలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో ఐదు రోజుల పాటు జరుగుతున్న ఉగాది ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని వేల సంఖ్యలో గాజులతో సుందరంగా అలంకరించి ముస్తాబు చేశారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. ఆలయ కమిటీ నిర్వాహకులు చిలుకూరి సుధాకర్, కనకదుర్గ దంపతులు కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మేళ తాళాలు, మంగళవాయిద్యాలు, తీన్‌మార్ డప్పులు, శక్తి వేషాలు, కోలాట ప్రదర్శనలు, భజనలు, గరగ నృత్యాలతో అమ్మవారి ప్రభను ఊరేగించారు. పూళ్ల, కొత్తపేట తదితర ఏరియాల్లో ప్రభను ఊరేగించగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

అమ్మవారిని దర్శించిన మాజీ ఎమ్మెల్యే

కొత్తపేటలోని శ్రీకనకదుర్గమ్మ తల్లిని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ కనకదుర్గాదేవి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్లు కందులపాటి శ్రీనివాసరావు, పుప్పాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, పార్టీ నేతలు పుప్పాల కార్తీక్, కందులపాటి అయ్యప్ప, వివిధ పార్టీల నేతలు పత్సమట్ల భీమరాజు, పుప్పాల హరీష్, కమిటీ పెద్దలు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

కొవ్వలి అంకమ్మ తల్లి సంబరాలు

దెందులూరు: కొవ్వలి గ్రామంలో ఆదివారం శ్రీ గోవాడ అంకమ్మ తల్లి సంబరం వేడుకలు వైభవంగా జరిగాయి. గత 150 సంవత్సరాలుగా గ్రామంలో రజక జన సంఘ ఆధ్వర్యంలో ఏటా ఉగాది పర్వదినం ఈ సంబరాలు నిర్వహిస్తున్నారు. శ్రీ అంకమ్మ తల్లిని వాయిద్యాలు, సన్నాయి మేళాలు, తీన్మార్ డప్పుల నడుమ గ్రామ పురవీధుల్లో అమ్మవారిని ఊరేగింపు నిర్వహించారు. గ్రామం అంతా పాడిపంటలతో, ప్రజలంతా కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో తులతూగాలని అమ్మవారిని ప్రార్థించారు. ,శ్రీ అంకమ్మ తల్లి కమిటీ ఆధ్వర్యంలో రజక జన సంఘం అధ్యక్షుడు గోవాడ నాగరాజు, గౌరవాధ్యక్షుడు గుళ్లపూడి వెంకటేశ్వరరావు, సెక్రటరీ గోవాడ శ్రీనివాసరావు, క్యాషియర్ గుళ్ళపూడి రమేష్, శ్రీను, జాయింట్ సెక్రెటరీ గోవాడ దుర్గారావు, కమిటీ పెద్దలు, గుళ్లపూడి శ్రీను, కల్లూరు సాయి, శీలం అప్పారావు, పెద్దలు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంతమార్కెట్ వద్ద పంచాంగ శ్రవణం

భీమడోలు: ఈ ఏడాది అన్ని రాశుల వారికి శుభయోగాలు ప్రాప్తిస్తాయని పంచాంగ కర్త బ్రహ్మశ్రీ కాశీబోట్ల నాగ వెంకట పార్వతీశ్వర శర్మ అన్నారు. భీమడోలు శ్రీగాయత్రీ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో గాయత్రీ బ్రాహ్మణ భవనం సంతమార్కెట్ వద్ద ఆదివారం విశ్వావసు సంవత్సరాదిని పురస్కరించుకుని ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాంగకర్త పార్వతీశ్వర శర్మ పంచాంగ శ్రవణం చేశారు. తొలుత షడ్రుచులతో కూడిన పచ్చడిని పంపిణీ చేశారు. అనంతరం ఆయన్ను సంఘం సభ్యులు, పెద్దలు ఘనంగా సత్కరించారు.

భక్తులతో కిటకిలాడిన ఆలయాలు

భీమడోలు: విశ్వావసు నామ సంవత్సరాది పురస్కరించుకుని ఆదివారం తెల్లవారుజాము నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భీమడోలు జంక్షన్‌లోని రూపకదేవాలయంలో పూజారి సాయిరామ్ స్వామివారికి పూజలు నిర్వహించారు. భక్తులకు షడ్రుచుల పచ్చడిని అందించారు. గుండుగొలనులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో పూజారి ప్రసాద్‌శాస్త్రి వారిచే పంచాంగ శ్రవణం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఈవో వంశీ, నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామారావు, ఆలయ పూజారి మంగపతి అచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వసంత నవరాత్రి ఉత్సవాలు

గణపవరం: గణపవరం సఖ్యాభివర్ధక నిలయంలో గాయత్రి బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో 105వ వసంత నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా ఉగాది రోజున ఈఉత్సవాలు ప్రారంభించి శ్రీరామ నవమివరకూ 9 రోజుల పాటు కొనసాగిస్తారు. శ్రీసీతారామచంద్రస్వామి వారి సన్నిధిలో విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభించారు. ప్రభాత సేవలు, మంగళవాయిద్యాలు, అభిషేకాలు, గోపూజలు నిర్వహించి అనంతరం వేదపండితులు పలువురు దంపతులచే శివ కల్యాణం, సీతారాముల కల్యాణం పూజలు జరిపించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహించి, పురాణ ప్రవచనాలు జరిపారు.

చల్లాలమ్మ ఉత్సవాలు ప్రారంభం


ఉంగుటూరు: విద్యుత్ దీపాలతో చల్లాలమ్మ తల్లి ఆలయ ప్రాంతం కళకళ

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామ దేవత చల్లాలమ్మ తల్లి ఉత్సవాలను ఆదివారం ప్రారంభించారు. వంశపారంపర్య ఆసాదు లు రజకులు గరగరూపంలో ఉన్న అమ్మవారిని పుట్టింటికి తీసుకువెళ్లారు. అక్కడ తల్లాప్రగడ భీమేశ్వరరావు దంపతులు పసుపు కంకుమలు సమర్పించి అమ్మవారికి పూజ లు చేశారు. అనంతరం పూరిగుడెసెవద్దకు అక్కడ నుంచి తిరిగి ఆలయంలోకి అమ్మవారిని తీసుకువచ్చారు. బాణసంచా, మేళతాళాల నడుమ అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో చల్లాలమ్మను దర్శించుకున్నారు. మహి ళలు చలివిడి పానకాలు సమర్పించారు. ఈవో శ్రీనివాసరావు, ఉత్సవ కమిటి చైర్మన్ సూరత్తులు స్వామి, భక్తులు పాల్గొన్నారు.


భీమడోలు: భీమడోలులో పంచాంగకర్త పార్వతీశ్వర శర్మను సత్కరిస్తున్న దృశ్యం


భీమడోలు: కనకదుర్గమ్మ ప్రభను ఊరేగిస్తున్న దృశ్యం


భీమడోలు: జంక్షన్‌లో ఉగాది పచ్చడిని అందిస్తున్న పూజారులు

క్రైస్తవుల శాంతి ర్యాలీ


గుండుగొలనులో శాంతియుత ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

భీమడోలు: క్రైస్తవులపై దాడులను అరికట్టాలని కోరుతూ గుండుగొలనులోని ఆదివారం క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. గుండుగొలను ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు పాకలపాటి యోహాన్, పాకలపాటి జాన్‌వెస్లీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ సువార్త ప్రసంగీకులు పగడాల ప్రవీణ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో వేలాది మంది క్రైస్తవులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. గుండుగొలను కూడలి ప్రాంతమైన రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వారంతా రోడ్డుపై మోకాళ్లపై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు పాకలపాటి యోహాన్, జాన్‌వెస్లీ మాట్లాడుతూ క్రైస్తవ సమాజం పరుల మేలు కోరుతుందని, అలాంటి క్రైస్తవులపై ఇటీవల దాడులు పెరిగిపోతున్నాయన్నారు. వాటిని ప్రభుత్వాలు అరికట్టాలని ముక్తకంఠంతో కోరారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ పెద్దలు, సంఘ విశ్వాసులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మ సన్నిధిలో పంచాంగ శ్రవణం


శ్రీ రాట్నాలమ్మ సన్నిధిలో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్థానిక నాయకులు, భక్తులు

పెదవేగి: శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్విదినాన్ని పురస్కరించుకుని పెదవేగి మండలం రాట్నాలకుంట శ్రీ రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రాట్నాలకుంట, రాయన్నపాలెం, కొండలరావుపాలెం, గ్రామాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సమక్షంలో ఆలయ అర్చకుడు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ పంచాంగ శ్రవణం జరిపారు. రాశిఫలాలు వినిపించారు. అనంతరం త్వరలో నిర్వహించబోయే అమ్మవారి ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. పందిరి రాటాను పాతి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో ఎన్ సతీష్‌కుమార్, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అప్పనవీడులో ఉగాది వేడుకలు


ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించారు. అనంతరం అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు. మాజీ చైర్మన్‌లకు పంచాంగం కానుకగా అందించారు. వట్లూరు సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఉంగుటూరు: కైకరం కళింగ రామాలయంలో రాములోరి కల్యాణ ఆహ్వాన పత్రికలను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఏప్రిల్ 6వ తేదీన స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉగాది సందర్భంగా రామాయలంలో అనిపెద్ది అశ్చుత రామయ్య శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పెదవేగి : కూడిపూడిలో పేకాట స్థావరంపై దాడి నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కె రామకృష్ణ తెలిపారు. నిందితుల నుంచి రూ.9,077 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

భార్యపై దాడి.. భర్తపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: భార్యను కొట్టి గాయపర్చిన నేరంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వర రావు తెలిపారు. వివరాల ప్రకారం మైసన్నగూడెంకు చెందిన షేక్ బషీర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడు తరచూగా భార్య గౌసియాబేగంతో గొడవ పడుతూ కొడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం మద్యం సేవించి వచ్చిన బషీర్ మోటార్‌సైకిల్ కొనివ్వలేదని ఇనుపరాడ్డుతో భార్య గౌసియాబేగంపై దాడి చేశాడు. గాయపడిన ఆమె స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

విర్డ్ ట్రస్ట్‌లో సభ్యులుగా ఇద్దరికి చోటు

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రి ట్రస్టు నూతన సభ్యులుగా శ్రీవారి దేవస్థానం అనువంశిక ధర్మకర్త వీఎస్ఎస్ నివృతరావు, డాక్టర్ భవ్యచంద్ నియమితులయ్యారు. ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు అధ్యక్షతన ఆదివారం ఆస్పత్రిలో ట్రస్టుబోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నివృతరావు, భవ్యచంద్‌లను సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులంతా కలసి ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, సౌకర్యాలను పరిశీలించారు. ఆ తరువాత గుప్తా ఫౌండేషన్ చైర్మన్ ఎంఎం గుప్తా సహకారంతో ఆస్పత్రిలో తయారైన ప్రోస్తాసిస్ 3డీ ప్రింట్ కృతిమ అవయవాలు, కాలిపర్స్‌ను 15 మంది దివ్యాగులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఎక్స్ అఫీషియో సభ్యుడు, శ్రీవారి దేవస్థానం ఈఓ ఎస్వీ సత్యన్నారాయణ మూర్తి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.